అందని జీతాలు.. కార్మికుల అవస్థలు

- పంచాయతీలకు నిలిచిన ఎస్‌ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధులు
- జీపీ సిబ్బందికి సకాలంలో అందని వేతనాలు
- నిస్సహాయ స్థితిలో అధికారులు

పెన్‌పహాడ్‌ : గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 29గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో 100మంది మల్టీపర్పస్ కార్మికులు విధులు నిర్వరిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 9500 చొప్పున వేతనాన్ని అందజేస్తోంది. కానీ వేతనాలు నెలల తరబడి రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

నిధులు లేకపోవడంతో ఇబ్బందులు..

రెండేళ్లుగా ఎస్‌ఎఫ్‌సీ నిధులు, ఐదు నెలలుగా సీఎఫ్‌సీ నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరడం ఇబ్బందిగా నెలకొంది. ఫలితంగా సిబ్బందికి వేతనాలు అందడం లేదు. జనరల్ ఫండ్ కూడా లేకపోవడంతో జీపీ కార్మికుల జీతాలు చెల్లించడం కష్టమవుతోంది. గత ఏడు నెలలుగా జీపీ కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.


అనంతారంలో చెత్తను సేకరిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఉదయం నాలుగు గంటలకే విధులకు..

మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య సేవలు చేపట్టాలంటే ఉదయం నాలుగు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం వరకు విధులు కొనసాగిస్తారు. వీరంతా ప్రతి రోజూ రోడ్లను శుభ్రం చేయడంతో పాటు ఇంటింటా చెత్త సేకరిస్తారు. మురికి కాల్వలు శుభ్రం చేయడంతో పాటు వివిధ పనులు చేస్తున్నారు. ఇవేకాక పాఠశాలలను శుభ్రం చేయడం, డంపింగ్ యార్డుల్లో తడిపొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్టు ఎరువులు తయారుచేయడం వంటి పనులు నిర్వర్తిస్తున్నారు. ఇంత శ్రమిస్తున్నా వారికి నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కుటుంబాలు గడవక అర్థాకలితో అలమటిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వేతనాలు చెల్లించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు.

పూట గడవడం కష్టంగా ఉంది

జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులను అడిగితే జీపీలో బడ్జెట్ లేదని చెబుతున్నారు. నెలనెలా జీతాలు రాకపోతే గ్రామ పంచాయతీ సిబ్బంది పూట గడిచేది ఎట్లా. ఇచ్చే జీతం తక్కువే అవి కూడా రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి నెలనెలా వేతనాలు చెల్లించాలి.

– సైదులు, పారిశుద్ధ్య కార్మికుడు

నిధులు రాగానే జీతాలు అందజేస్తాం



ప్రస్తుతం ఎస్‌ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధులు రాకపోవడంతో జీపీ నడపడం ఇబ్బందిగా ఉంది. గ్రామ పంచాయతీల్లో ఉన్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. నిధులు రాగానే జీతాలు అందజేస్తాం.

– నరేష్, ఎంపీఓ

లోక్ అదాలత్‌లో ఒక్కటైన భార్యాభర్తలు

తుంగతుర్తి : వాళ్లిద్దరూ భార్యాభర్తలు. కొన్ని రోజులు బాగానే కలిసి కాపురం చేశారు. ఏమైందో ఏమో గాని వారి కాపురంలో కలహాలు మొదలయ్యాయి. చివరికి విడిపోయే వరకు పరిస్థితులు వచ్చాయి. కొన్ని నెలలు వీరిద్దరూ కోర్టుల చుట్టూ తిరిగారు. తరువాత న్యాయవాదులు, న్యాయమూర్తి సమక్షంలో వివాదాలు మరిచిపోయి కలిసి జీవిస్తామని ఒక్కటై తమ ఇంటికి వెళ్లిపోయారు. ఈ సంఘటన తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తిరుమలగిరి మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పాన్నాల కార్తీక్‌కు నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామానికి చెందిన మౌనికకు 2021లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరి కాపురంలో చిన్న చిన్న తగాదాలు ఏర్పడి మనస్పర్థలతో విడిపోయారు. దీంతో మౌనిక నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో తన భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ నైపథ్యంలో ఇరువురు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫర్హీనకౌసర్ దంపతులిద్దరికీ పలుమార్లు కౌన్సిలింగ్ చేస్తూ వస్తున్నారు. దీంతో ఆ భార్యాభర్తలిద్దరూ కలిసి జీవించాలని నిర్ణయానికి వచ్చి తమ కేసులో రాజీపడ్డారు. ఇకపై కలహాలు లేకుండా కలిసి జీవిస్తామని జడ్జి సమక్షంలో ఇరువురు పూల దండలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సౌజన్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత, కోర్టు సూపరింటెండెంట్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు గుగులోతు రాజారాం, బానోత్ ప్రతాప్, న్యాయవాదులు పాల్గొన్నారు.


రాజీపడిన భార్యాభర్తలతో మాట్లాడుతున్న జడ్జి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వెంపటిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెన్‌పహాడ్ : నాగులపాటి అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గదుల్లోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : వెంపటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు సోమయ్య, మల్లారెడ్డి, జనార్దన్, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, మోతె శీను, రామచంద్రయ్య, విష్ణుమూర్తి, పుల్లయ్య, మల్లయ్య, వెంకటరమణ, రవీందర్, పూర్వ విద్యార్థులు నరేష్, రాము, శ్రీను, వెంకటయ్య, రమేష్, వెంకన్న, అనిత, కవిత, జ్యోతి, రమాదేవి, దివ్య, మంజుల పాల్గొన్నారు.


అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాలు


వెలిశాలలో పూజలు చేస్తున్న దామోదర్ రెడ్డి

తిరుమలగిరి : మండలంలోని వెలిశాల గ్రామంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బొడ్రాయికి జలాభిషేకం చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, గుడిపాటి నర్సయ్యలు బొడ్రాయి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ పార్టీ నాయకులు కొప్పుల వేణారెడ్డి, పాలకుర్తి రాజయ్య, దూపటి మల్లయ్య, కడారి కుమార్, మల్లేష్, ఎల్లంల యాకన్న, మొగిలి సాయికిరణ్, మల్లేష్, యాకేష్, వేణు, గ్రామ శాఖ అధ్యక్షులు దూపటి అశోక్, పాలబిందెల హరీష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహడ్ గ్రామంలో శనివారం విద్యాదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్టపెంజర భద్రమ, పిడమర్తి కవిత, పిడమర్తి జ్యోతిలకు చెందిన గేదెలను మేతకోసం వదిలి పెట్టారు. గేదెలు మేస్తున్న క్రమంలో తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలాయి. దీంతో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ. 70 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలి

సూర్యాపేట : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్నా జగన్ అన్నారు. మండల పరిధిలోని కేసారం గ్రామంలో డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటకు కూలి ఖర్చులు తక్కువ, కోతుల బెడద లేదన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు, ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ జె.హరీష్, జూనియర్ మేనేజర్ శశికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ యానాల సుధాకర్‌రెడ్డి, జైన్ డ్రిప్ ప్రతినిధి జెట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


కేసారంలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాల అమ్మకాలు నిషేధించాలి

మునగాల : ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు నిషేధించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శనివారం ప్రకటనలో కోరారు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2010లో విడుదల చేసిన జీఓను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

డిజిటల్ బోధనకు ఏర్పాట్లు


కేజీబీవీలో కొత్తగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లు


తరగతి గదిలో బిగించిన డిజిటల్ బోర్డు

- అర్వపల్లిలోని కేజీబీవీకి చేరిన కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు
- బాలికలకు అందనున్న సాంకేతిక విద్య

అర్వపల్లి : అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా కంప్యూటర్ విద్యను అందించనున్నారు. ఇందుకోసం గత విద్యాసంవత్సరం చివరలో కంప్యూటర్లు వచ్చాయి. వాటిని ఇటీవల బిగించారు. బాలికలకు 6 నుంచి 10 వరగతి వరకు కంప్యూటర్ విద్య అందించడం కోసం ప్రభుత్వం 8 కంప్యూటర్లను పంపించింది. కంప్యూటర్ విద్యతో పాటు ఈ కేజీబీవీలో డిజిటల్ బోధనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. బాలికలకు చదువుల్లో ఇబ్బందులు ఎదురు కాకుండా ఫర్నిచర్ ఏర్పాటు చేస్తున్నారు. తరగతి గదులకు డ్యూయల్ డెస్క్ బల్లాలు వచ్చాయి. ఇతర ఫర్నిచర్ కూడా సమకూరింది.


కేజీబీవీకి వచ్చిన బల్లాలు, ఫర్నిచర్

కంప్యూటర్ విద్య అందిస్తాం

ఈసారి కేజీబీవీలో కంప్యూటర్ విద్యను అందిస్తాం. కొత్తగా 8 కంప్యూటర్లు వచ్చాయి. పాఠశాల పునః ప్రారంభం కాగానే అన్ని తరగతుల బాలికలకు ప్రతిరోజు కంప్యూటర్ శిక్షణ మొదలవుతుంది. ఇప్పటి వరకు కంప్యూటర్లు లేక ఈ విద్యను అందించడం ఇబ్బందిగా మారింది.

– కనుకు సరిత, కంప్యూటర్ శిక్షకురాలు

కార్పొరేట్ స్థాయిలో బోధన

కేజీబీవీలో కంప్యూటర్, డిజిటల్ బోధనకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. డిజిటల్ బోధనకు సంబంధించి అన్ని తరగతి గదుల్లో బోర్డులు బిగించారు. డ్యూయల్ డెస్క్ బల్లాలు కూడా వచ్చాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తుండటంతో కార్పొరేట్ స్థాయిలో విద్య అందనుంది.

– జి.నాగరాణి, ప్రత్యేక అధికారిణి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


తుంగతుర్తి : కొత్తగూడెంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


అర్వపల్లి : తిమ్మాపురం జంగాలకాలనీలో బడిబాట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు


నాగారం : డి.కొత్తపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు బి.కిష్టయ్య అన్నారు. శనివారం డి.కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్‌ల ఆధ్వర్యంలో మూడవ రోజు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, 2జతల దుస్తులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, ధారం నాగరాజు, సుగుణ, రామచంద్రయ్య, అవిలేను, పీఈటీ అవిలయ్య, లింగయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

తుంగతుర్తి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు పరమేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పర్వీన, అంగన్‌వాడీ టీచర్లు శారద, ఆయాలు పుష్ప, యలేంద్ర, గ్రామస్తులు మల్లయ్య, రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని తిమ్మాపురం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణయ్య కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం తిమ్మాపురం గ్రామంలోని జంగాలకాలనీలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం. రవీందర్‌రెడ్డి, రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భూముల వేలం రద్దు

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు ఈ నెల 6న నిర్వహించిన వేలం పాటను రద్దు చేసినట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కుశలయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 100.20ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు నిర్వహించిన వేలం పాటను గ్రామానికి చెందిన కొంపెల్లి నాగరాజు రూ. 17లక్షల 40వేలకు దక్కించుకోగా అతడు నిబంధనల ప్రకారం రెండు రోజుల్లో డబ్బులు చెల్లించకపోవడంతో వేలం రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న తిరిగి వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ. 3లక్షల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

శ్రీకంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు


జలబిందెలతో వెళ్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : తంగెళ్లగూడెం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం శ్రీ కంఠమహేశ్వర సురమాంబ దేవి ద్వితీయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలలు ధరించి జలబిందెలతో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలు జరిపారు.

నిధులు కేటాయించాలి

మునగాల : తిమ్మారెడ్డిగూడెం పరిధిలో ఎడమ కాలువపై నిర్మించిన ధనలక్ష్మి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు తిమ్మారెడ్డి రాఘవరెడ్డి మాట్లాడారు. ధనలక్ష్మి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులు పగిలిపోవడంతో కొంతకాలంగా మూతపడిందని, మరమ్మతు పనులకు అవసరమైన నిధులు కేటాయించి సక్రమంగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారని తెలిపారు. త్వరలోనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల సంబురాలు

తిరుమలగిరి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తిరుమలగిరిలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, సుంకరి జనార్దన్, తిరుమని యాదగిరి, కందుకూరి లక్ష్మయ్య, కిష్టునాయక్, హీరూనాయక్, భిక్షం, సురేష్, రవి, రమేష్, శ్రీనివాస్, పరమేష్, మహేష్, సంపత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..

చివ్వెంల : తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్, ఉపాధ్యక్షుడు మాదంశెట్టి వీరన్న, పట్టణ అధ్యక్షుడు డేగల రమేష్, వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, గన్న జానకిరాములు, నాగు శంకర్, క్రిష్ణ, గుత్తి నగేష్, తోట మురళి, సురేష్, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, రాధాక్రిష్ణ, అంజయ్య, రామసాని శ్రీనివాస్, అశ్విన్ పాల్గొన్నారు.


తిరుమలగిరిలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో..

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ఎదుట కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, సీనపల్లి సోమేశ్వర్, దాసరి వెంకటేశ్వర్‌రావు, నర్సయ్య యాదవ్, దోరెపెల్లి రమేష్, రఘు రామయ్య, పరిదోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రంజిత్ (ఫైల్)

హుజూర్‌నగర్ : కుటుంబ సభ్యుల వేధింపులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం హుజూర్‌నగ్‌లో జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ చిట్టిప్రోలు రంజిత్‌కుమార్(32) స్థానిక సీతారాంనగర్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో భార్య స్వప్న, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులతో రంజిత్‌కుమార్ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి చిట్టిప్రోలు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

కోదాడరూరల్ : లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టులో పెండింగ్‌లో ఉన్న 3,874 కేసులను పరిష్కరించి రూ.16,87,920ల జరిమానా విధించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కే మూర్తి, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు తాటి మురళి, నాళం రాజన్న, అర్వపల్లి పవన్, అవుల మల్లికార్జునరావు, న్యాయవాదులు మేకల వెంకట్రావు, పాలేటి నాగేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, రంజాన్ పాషా, దావీదు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వన నర్సరీ పరిశీలన


వన నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : వర్షాలు పడగానే తెలంగాణకు హరితహారం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ అన్నారు. మండల పరిధిలోని అడివెంల గ్రామంలో శనివారం వననర్సరీని పరిశీలించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలో 1.70 లక్షల మొక్కలను నాటనున్నట్లు చెప్పారు. మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గంగ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను శనివారం హైదరాబాద్‌లో అర్వపల్లి దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ బైరబోయిన సైదులు కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఎంపీగా గెలిచిన కిరణ్‌కుమార్‌రెడ్డి తొలుత అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేయాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


సంగెంలో మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

తుంగతుర్తి : మండల పరిధిలోని సంగెం గ్రామ మాజీ సర్పంచ్ మారగాని వెంకటయ్య మాతృమూర్తి మారగాని అమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలు శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు లూటీ

పెన్‌పహాడ్ : చేపల చెరువు లూటీ చేసిన సంఘటన మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మత్స్య సొసైటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఈదులవాగు కుంటలో మృగశిర కార్తెను పురస్కరించుకొని చేపల కోసం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెరువులోకి దిగి లూటీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మత్స్య సొసైటీ సభ్యులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

రామోజీరావుకు కొవ్వొత్తులతో నివాళి


అర్వపల్లిలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న స్థానికులు

అర్వపల్లి : రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ అర్వపల్లిలో శుక్రవారం రాత్రి స్థానికులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ విద్యాసాగర్, మహరాజు, రమేష్, వెంకట్, వేణు, అనిల్, కృష్ణమూర్తి, మల్లయ్య, లింగయ్య, లవకుమార్, వీరయ్య, దేవయ్య, రాజేష్, రమేష్, రామ్మూర్తి, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో వార్షికోత్సవాలు

మునగాల : మండల కేంద్రం శివారులోని అయ్యప్ప దేవాలయం వార్షికోత్సవాలను శనివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం జరిపించారు. హోమం నిర్వహించి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాసాచారి, అర్చకులు నరమనేని రామారావు గురుస్వామి భక్తులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు